ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
శుక్రవారం, 18 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 32 | పేజీలు: 4 వెల: 5

## యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు హత్య

- నిజామాబాద్‌లో దారుణ ఘటన
- కారులో వచ్చిన దుండగులు.. ఆయుధాలతో దాడి
- పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగినట్లు పోలీసుల అనుమానం




# మా వాటా మాకివ్వండి

## రాజ్యాధికారం సాధనే బీసీల అభివృద్ధికి మార్గం

- జనరల్ సీటు అంటే ఓసీలే పోటీకి నిలబడాలా..?
- జనరల్ సీట్లు అందరివీ.. ఒక్క వర్గానికే ఎందుకు?
- ఓసీలకు నోట్ల బలం ఉంటే.. బీసీలకు ఓట్ల బలం ఉంది
- ఆ బలాన్ని గుర్తించి ఐక్యంగా పోరాడితేనే సత్ఫలితం
- బీసీలకు జరుగుతున్న దగాపై ఐక్య పోరాటాలతో ముందుకెళ్లాలి
- బీసీ నినాదంపై ఏ రూపంలో అయినా సప్పుడైతే మంచిదే
- ఇప్పుడు మార్పునకు అడుగులు పడుతున్నాయి.. పార్టీల్లో ఆ భయం మొదలైంది
- వరంగల్ జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో బీసీల పవర్ చూపుతాం
- అక్టోబర్‌లో పరకాలలో బీసీల బహిరంగ సభ పెడుతున్నాం
- ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 8 సభలకు ప్లాన్ చేశాం
- బీసీలను ఏకం చేస్తాం.. బీసీ లీడర్లు ఏ పార్టీలో ఉన్నా ఎంకరేజ్ చేస్తాం
- ఓబీసీ ప్రెసిడెంట్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్




"బీసీలకు స్కీంలు కాదు.. రాజకీయంగా సీట్లు కావాలి. రాజకీయంగా నిలబడితేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. రాజ్యాధికారం సాధించడమే బీసీల అభివృద్ధికి మార్గం. బీసీలకు రావాల్సిన రాజకీయ వాటా దక్కే వరకు మా ఉద్యమం కొనసాగుతుంది. బీసీలకు జరుగుతున్న దగాపై ఐక్య పోరాటాలతో ముందుకు సాగాల్సిందే" అని ఓబీసీ ప్రెసిడెంట్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు.జనరల్ సీటు అంటే ఓసీలకు కేటాయించబడిన సీట్లన్న భావన అన్ని పార్టీల్లో నెలకొని ఉండటం దురదృష్టకరం. జనరల్ సీట్లు అందరివీ అయినప్పుడు ఒక్క వర్గానికే ఎందుకు పరిమితం చేస్తున్నారు? ఓసీలకు నోట్ల బలం ఉంటే.. బీసీలకు ఓట్ల బలం ఉంది. ఆ బలాన్ని గుర్తించి బీసీలంతా ఐక్యంగా పోరాడితేనే సత్ఫలితం వస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగాలు, వరంగల్ అభివృద్ధి, తన రాజకీయ ప్రస్థానంపై ఓబీసీ ప్రెసిడెంట్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!!

# ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్

- హైదరాబాద్‌లో హార్వర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్
- అత్యుత్తమ బిజినెస్ స్కూళ్లతో తెలంగాణకు ప్రపంచ గుర్తింపు
- 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి




**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్‌లో డిసెంబర్ నుంచి ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను అందించనున్నట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. యూకే బిజినెస్ స్కూల్స్ ప్రతినిధుల బృందంతో ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో నిర్వహించిన సమావేశంలో సీఎం ఈ వివరాలు వెల్లడించారు. భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓ ఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులతో పాటు 30 మంది యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రపంచ స్థాయి విద్యాసంస్థలకు ఆహ్వానం**

యూకే బిజినెస్ స్కూల్స్ తెలంగాణలో ఏర్పాటైతే ప్రపంచ స్థాయి కార్పొరేట్ సంస్థల చూపు రాష్ట్రం వైపు మళ్లుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో కలిసి విదేశీ విద్యాసంస్థలు

........(తరువాయి 2లో)



- కృష్ణా జలాల కోసం న్యాయపోరాటం చేస్తాం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు
- హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్స్
- సెప్టెంబరు 17 ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహణ
- నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు





# ఈ నేలది ధిక్కార స్వరం

## ప్రజల ఆత్మగౌరవమే ప్రజాపాలనకు పునాది

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పించారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు తెలంగాణ పుట్టినిల్లు అని పేర్కొన్నారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించిందన్నారు. సెప్టెంబరు 17ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా నాంపల్లి పబ్లిక్

........(తరువాయి 2లో)




### అసెంబ్లీ సాక్షిగా సీఎం అబద్దాలు

- నాపై నిరాధారమైన భూకబ్జా ఆరోపణలు సిగ్గుచేటు
- ఆధారాలుంటే నేనే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- రేవంత్ రెడ్డి భూ ఆరోపణలన్నీ అసత్యాలే
- దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- అసెంబ్లీలో చర్చ పెడితే భూ కుంభకోణం అసలు రూపం బయటపడుతుంది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు




### కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై ఇనుప రాడ్‌తో దాడి

- మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా అడ్డుకున్న దుండగులు
- తలపై బలంగా కొట్టి తీవ్రంగా గాయపరిచిన గుర్తుతెలియని వ్యక్తులు
- తీవ్రంగా గాయపడిన వేలేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్

# అదే గుంత.. అదే లైన్.. 9 రెట్లు బడ్జెట్!

## నాడు రూ.5 లక్షలు.. నేడు రూ.45 లక్షలు

- 70 శాతం మొక్కలు మాయం.. బిల్లులు మాత్రం క్లియర్?
- అదే ప్రాంతంలో మళ్లీ టెండర్ ఎలా?
- హైటెన్షన్ లైన్ కింద మొక్కల నాటకంపై ప్రశ్నలు
- ఏడాదిగా పెండింగ్‌లో టెండర్
- లెక్కలు అడిగితే అధికారుల దాటవేత
- వరంగల్ బల్దియాలో అంతుచిక్కని అధికారుల లీలలు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ బల్దియాలో హరితహారం పేరుతో జరుగుతున్న పనులపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశాయిపేట హైటెన్షన్ లైన్ కింద మొక్కలు నాటేందుకు గతంలో రూ.5 లక్షలు ఖర్చు చేసిన అధికారులు.. అదే ప్రాంతంలో మళ్లీ రూ.45 లక్షలతో టెండర్ పిలవడం చర్చకు దారితీసింది. నాడు చేసిన పనులు నిలవకపోవడం, నేడు అంచనా వ్యయం ఏకంగా 9 రెట్లు పెరగడం వెనుక కారణాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. 202324లో దేశాయిపేట పెద్ద విద్యుత్ లైన్ కింద బల్దియా హార్టికల్చర్ విభాగం రూ.5 లక్షలతో మొక్కలు నాటింది. అయితే ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తే నాటిన మొక్కల్లో సుమారు 70 శాతం ఎండిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. మిగిలిన మొక్కలు కూడా సరైన సంరక్షణ లేక ఇబ్బందులు పడుతున్నాయి. నీటి సరఫరా, కాపలా, నిర్వహణ లేకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**మళ్లీ అదే చోట రూ.45 లక్షల టెండర్**

మొక్కలు నిలవని

.....(తరువాయి 2లో)



# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై రెవెన్యూ అధికారుల దృష్టి

- ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లు, రికార్డులపై ఆరా
- ఎర్రవల్లిలో సర్వే నంబర్ 325ను పరిశీలించిన ఆర్డీవో
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు సీఎం ఆదేశం

**కాకతీయ, సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సంబంధించిన ఫామ్‌హౌస్ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలోని ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లు, గతంలో ఉన్న రైతుల పేర్లు, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ నివేదికలు రూపొందిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆర్డీవో చంద్రకళ ఎర్రవల్లిలో పర్యటించారు. ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి సమాచారం సేకరించారు.



**రికార్డుల ఆధారంగా నివేదికలు**

ఫామ్‌హౌస్ పరిసరాల్లోని భూములకు సంబంధించిన పాత, ప్రస్తుత రికార్డులను అధికారులు సరిపోల్చుతున్నారు. గతంలో భూములు ఎవరి పేర్లపై ఉన్నాయనే వివరాలతో పాటు ప్రస్తుతం అవి ఏ విధంగా నమోదై ఉన్నాయనే అంశాలపై నివేదికలు సిద్ధం

........(తరువాయి 2లో)

# అసెంబ్లీ సాక్షిగా సీఎం అబద్ధాలు

- నాపై నిరాధారమైన భూకబ్జా ఆరోపణలు సిగ్గుచేటు
- ఆధారాలుంటే నేనే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- రేవంత్ రెడ్డి భూ ఆరోపణలన్నీ అసత్యాలే
- దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- అసెంబ్లీలో చర్చ పెడితే భూ కుంభకోణం అసలు రూపం బయటపడుతుంది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలకు తెరలేపారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. తనపై భూ కబ్జాలకు సంబంధించిన ఆరోపణలు చేస్తున్నారని, అందుకు ఆధారాలు చూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని స్పష్టం చేశారు. తన వారసత్వ భూములను అమ్ముకొని రాజకీయాలు చేశానే తప్ప.. రేవంత్‌రెడ్డిలా భూ కబ్జాలకు పాల్పడలేదని అన్నారు. దమ్ముంటే భూ కుంభకోణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. అధికారులను అడ్డం పెట్టుకొని బెదిరింపులకు పాల్పడితే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు. తనపై, బీఆర్ఎస్ నాయకులపై ఆధారాలు లేకుండా అడ్డగోలుగా మాట్లాడటం మానుకోవాలని సూచించారు.

**అసెంబ్లీలో చర్చకు సిద్ధమా**

కేటీఆర్, హరీశ్‌రావు తదితర బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తారనే భయంతో వారిని సభకు రానీయకుండా కుట్రలు పన్నారని ఎర్రబెల్లి ఆరోపించారు. దమ్ముంటే అసెంబ్లీలో భూ వ్యవహారాలపై చర్చ పెట్టాలని, అప్పుడు అసలు రూపం బయటపడుతుందని అన్నారు. తెలంగాణ కోసం పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధమైన కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తప్పించుకొని పారిపోయిన వ్యక్తి ఇప్పుడు త్యాగాల గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అసెంబ్లీతో పాటు తెలంగాణ పరువును తీస్తున్నారని మండిపడ్డారు.

# అదే గుంత.. అదే లైన్.. 9 రెట్లు బడ్జెట్!

**(మొదటిపేజీ తరువాయి)**

అదే ప్రాంతంలో మళ్లీ మొక్కలు నాటేందుకు రూ.45 లక్షలతో టెండర్ పిలవడం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది. రూ.5 లక్షల పనికి ఏడాది వ్యవధిలో రూ.45 లక్షల అంచనా ఎలా రూపొందించారు? పనుల పరిమాణం పెరిగిందా? ధరల మార్పు కారణమా? లేక అంచనాల రూపకల్పనలో లోపాలున్నాయా? అనే ప్రశ్నలకు బల్దియా అధికారులు సమాధానం చెప్పాలి. 33/132 కేవీ హైటెన్షన్ లైన్ కింద ఎత్తుగా పెరిగే చెట్లు నాటడం విద్యుత్ భద్రతకు సమస్యగా మారే అవకాశం ఉంది. చెట్లు పెరిగి విద్యుత్ తీగలకు తగిలితే ప్రమాదం సంభవించే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలో మొక్కలు నాటేందుకు ఎవరు అనుమతించారు? ఎలాంటి సాంకేతిక పరిశీలన జరిగింది? అనే వివరాలు బయటపెట్టాలి. రూ.45 లక్షల టెండర్ ఏడాదిగా పెండింగ్‌లో ఉండటానికి కారణం కూడా స్పష్టం చేయాలి.

**లెక్కలు అడిగితే దాటవేత**

వరంగల్ బల్దియాలో గత 5 ఏళ్లలో ఎన్ని మొక్కలు నాటారు? వాటిలో ఎన్ని బతికాయి? ఎంత నిధులు ఖర్చు చేశారు? అనే వివరాలు కోరితే అధికారులు ఆన్‌లైన్‌లో అందుబాటులో లేవని, రిజిస్టర్లు పరిశీలించి ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రజాధనంతో చేపట్టిన పనుల వివరాలు పారదర్శకంగా ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. దేశాయిపేటలో గతంలో చేసిన రూ.5 లక్షల పనులకు సంబంధించిన బిల్లులు, ఫొటోలు, కొలతల పుస్తకాలు బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. రూ.5 లక్షల నుంచి రూ.45 లక్షలకు అంచనా పెరగడంపై విజిలెన్స్ విచారణ జరపాలని, హైటెన్షన్ లైన్ కింద మొక్కలకు అనుమతి ఇచ్చిన ఇంజనీర్ వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. పచ్చదనం పేరుతో నిధుల వినియోగం జరుగుతోందా.. లేక కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమేనా అన్న అనుమానాలను నివృత్తి చేయాలని పర్యావరణ ప్రేమికులు కలెక్టర్‌ను కోరుతున్నారు.





# ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్



**(మొదటిపేజీ తరువాయి)**

పరిశోధనలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. హార్వర్డ్, ఎంఐటీ, లండన్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ వంటి సంస్థలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, డ్యూయల్ డిగ్రీలు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యాలు ప్రారంభించవచ్చన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. దాదాపు 30,000 ఎకరాల్లో దేశంలోనే తొలి నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. అక్కడ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుతో భావితరాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

**భారీ పెట్టుబడులకు వేదికగా తెలంగాణ**

డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు యూకే విద్యా రంగ ప్రముఖులను రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తరహాలో సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్, అమెజాన్ లక్ష కోట్ల పెట్టుబడితో డేటాసెంటర్ నిర్మాణం చేపడుతోందన్నారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై ఇనుప రాడ్‌తో దాడి

**కాకతీయ, స్టేషన్‌ఘన్‌పూర్ :** స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం వేలేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఆయనను సాయిపేట-కేశవనగర్ సమీపంలో గుర్తుతెలియని దుండగులు అడ్డుకున్నట్లు సమాచారం. అనంతరం ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. అకస్మాత్తుగా జరిగిన దాడితో లక్ష్మణ్ నాయక్ కిందపడిపోయినట్లు తెలుస్తోంది. దాడికి పాల్పడిన వ్యక్తులు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. గాయపడిన లక్ష్మణ్ నాయక్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి బాధితుడు లక్ష్మణ్ నాయక్‌ను ఎంజీఎంలో పరామర్శించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దాడికి గల కారణాలు, దుండగుల వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై రెవెన్యూ అధికారుల దృష్టి



**(మొదటిపేజీ తరువాయి)**

చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూముల సరిహద్దులు, సర్వే నెంబర్లు, రికార్డుల స్థితిగతులను కూడా నమోదు చేస్తున్నారు.

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై సీఎం ఆదేశాలు**

కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 295 ఎకరాల భూమి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వివరించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై పలు ఆరోపణలు చేసిన ఆయన.. 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందా లేదా తేల్చాలని అధికారులను ఆదేశించారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని గుర్తించి పేదలకు, దళితులకు పంచిపెడతామని సీఎం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి భూముల రికార్డుల పరిశీలనకు ప్రాధాన్యం ఏర్పడింది.

## యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు హత్య



**కాకతీయ, నిజామాబాద్ :** నిజామాబాద్ నగరంలోని రాజరాజేంద్ర జంక్షన్ వద్ద యూట్యూబర్ వైష్ణవి భర్త చిత్తరి హరిబాబు (26) దారుణహత్యకు గురయ్యాడు. మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న హరిబాబును కారులో వచ్చిన గుర్తుతెలియని దుండగులు అడ్డుకుని పదునైన ఆయుధంతో తలపై దాడి చేశారు. తీవ్రగాయాలతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. హరిబాబు తన తల్లితో కలిసి నిజామాబాద్ ఐదో పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంద్రాపూర్‌లో నివసిస్తున్నాడు. గురువారం రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముతున్న సమయంలో దాహం వేయడంతో సమీపంలోని చాట్ బండి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు దాడికి పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

**గతంలో భార్య వైష్ణవిపై హత్యాయత్నం కేసు**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్‌కు చెందిన వైష్ణవితో హరిబాబుకు వివాహమైంది. గతంలో వైష్ణవిపై దాడి చేసి హత్యకు ప్రయత్నించిన కేసులో హరిబాబును పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన ఇప్పుడు హత్యకు గురయ్యాడు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దుండగుల కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

# ఈ నేలది ధిక్కార స్వరం





**(మొదటిపేజీ తరువాయి)**

గార్డెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ పోరాట చరిత్ర, హైదరాబాద్ భారతదేశంలో విలీనం, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మాట్లాడారు.

**సమ్మక్క-సారలమ్మ నుంచి సాయుధ పోరాటం వరకు**

అన్యాయాన్ని ఎదిరించడం తెలంగాణ గడ్డ స్వభావమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సమ్మక్కసారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు ఈ నేల ప్రజలు అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. తెలంగాణ సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబరు 17వ తేదీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించినప్పటికీ, గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అణచివేతలు కొనసాగాయని వివరించారు. నిజాం పాలన చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను తీవ్రంగా కల్లోలపరిచాయని పేర్కొన్నారు. ప్రజలపై హింస, దౌర్జన్యాలు పెరగడంతో భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడిందన్నారు. నిజాం ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు రగిలాయని చెప్పారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని తెలిపారు. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి, చాకలి ఐలమ్మ వంటి యోధులు పోరాటాలకు నాయకత్వం వహించడం గొప్ప విషయమన్నారు.

**హైదరాబాద్ భారతదేశంలో అంతర్భాగం**

హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు నెహ్రూ, పటేల్ నాయకత్వంలో సైనిక చర్య చేపట్టినట్లు సీఎం తెలిపారు. ఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత ప్రభుత్వానికి లొంగిపోయారని చెప్పారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైందన్నారు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం సెప్టెంబరు 17 అని సీఎం పేర్కొన్నారు. ఈ రోజును ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడం ద్వారా ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతున్నామని తెలిపారు. ప్రజల కోసం, ప్రజల భాగస్వామ్యంతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణ తన పొరుగు రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడుతోందని చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలుగా ఉందని, ఇది దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం అధికమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**కృష్ణా జలాల కోసం న్యాయపోరాటం**

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలని, ఆర్థిక స్వావలంబన సాధించాలనేది ప్రభుత్వ ఆలోచన అని సీఎం తెలిపారు. మహిళలకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళల భద్రత, గౌరవం, ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలనేది ప్రభుత్వ ఆశయమన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రగతి కేవలం గణాంకాల్లో కాకుండా ప్రతి కుటుంబ జీవన ప్రమాణాల్లో కనిపించాలన్నారు.

**1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు**

రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సీఎం ప్రకటించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. 2.25 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు సీఎం వెల్లడించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వారికి పింఛన్లు అందేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పింఛన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి భరోసా అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగంగా అందేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

**హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్స్**

హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం చేపట్టినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యమన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల సమస్యకు పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని తెలిపారు. ఇల్లు కేవలం నివాసం కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై నమ్మకం కల్పించే ఆధారం అని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో పేదలు, మధ్యతరగతి ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు.

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్లు సీఎం గుర్తుచేశారు. బీసీలకు రాజకీయ, సామాజిక న్యాయం అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. బీసీల జనాభా, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యంలో తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలు అభివృద్ధి పథంలో ముందుకు రావాలని పేర్కొన్నారు. బీసీల హక్కులను కాపాడుతూ వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజాపాలన అంటే కేవలం పాలన నిర్వహించడం కాదని సీఎం చెప్పారు. ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడం, ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించేలా చూడటమే ప్రజాపాలన లక్ష్యమన్నారు. అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు, ప్రజల ఆకాంక్షలు ప్రభుత్వానికి మార్గదర్శకాలని తెలిపారు. ఆ స్ఫూర్తితో తెలంగాణను అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలతో ముందుకు తీసుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# భూమి, భుక్తి, వెట్టి విముక్తి కోసం నాటి పోరాటం

- సాయుధ పోరాట స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలి
- విద్యార్థుల సమస్యలపై ఐక్య ఉద్యమాలు కొనసాగించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.డి. దావూద్

**కాకతీయ, ఏటూరునాగారం:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి ప్రజా సమస్యలపై విద్యార్థులు ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.డి. దావూద్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఏటూరు నాగారం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా దావూద్ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన పోరాటంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు ఐక్యంగా పోరాడి త్యాగాలు చేశారని తెలిపారు. విద్యార్థులు చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి మాట్లాడుతూ నాణ్యమైన విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లలో వసతులు కల్పించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు అధ్యయనం-పోరాటం స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# కొత్త సబ్ సెంటర్ పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్

**కాకతీయ,శంకరపట్నం:** మండలంలోని కేశవపట్నం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య సబ్ సెంటర్‌ను గురువారం అసిస్టెంట్ కలెక్టర్ హరి ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలపై అక్కడ విధులు నిర్వహిస్తున్న సిస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సేవలు, సిబ్బంది విధులు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, సెకండ్ ఏఎన్ఎం శ్రీవాణి, ఆశా కార్యకర్తలు లలిత, మహాలక్ష్మి, సుజాత, కోమల, లక్ష్మి, భవన నిర్మాణ కాంట్రాక్టర్, ఏఈలు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో సింగారం దీక్షిత్‌కు ప్రథమ స్థానం



**కాకతీయ, నెల్లికుదురు :** మహబూబాబాద్ జిల్లాలో ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2047 పర్స్పెక్టివ్ అండ్ ఛాలెంజర్స్ అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో పీఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాల, నెల్లికుదురుకు చెందిన పదో తరగతి విద్యార్థి సింగారం దీక్షిత్ జిల్లా ప్రథమ స్థానం సాధించాడని ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. ఉపేందర్ రావు విద్యార్థి సింగారం దీక్షిత్‌ను, అతనికి మార్గదర్శకత్వం అందించిన ఉపాధ్యాయుడు అబ్దుల్ నబీని అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు దీక్షిత్‌కు అభినందనలు తెలియజేశారు.

# హిందీ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలి



**కాకతీయ, డోర్నకల్:** హిందీ భాషపై విద్యార్థులు తప్పక పట్టు సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి నర్సింహారావు సూచించారు. డోర్నకల్ మండల కేంద్రంలోని పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు కలపాల అనిత, తల్లారి సమిత ఆధ్వర్యంలో హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహించి హిందీ భాష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బండి నర్సింహారావు మాట్లాడుతూ హిందీ దేశంలోనే కాకుండా ప్రపంచంలోని అనేక దేశాల్లో వాడుకలో ఉందన్నారు. ఇంగ్లీష్‌తో పాటు హిందీ నేర్చుకోవడం వల్ల వివిధ ప్రాంతాల ప్రజలతో సంభాషించడం సులువవుతుందని తెలిపారు. హిందీని అధికార భాషగా గుర్తించడంలో బియోహార్ రాజేంద్ర సింగ్, మైథిలీ శరణ్ గుప్త్, హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కాలేల్కర్, సేథ్ గోవింద్ దాస్ తదితరులు కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమీనా బీ, కమల, దమయంతి, మాలతి, వరలక్ష్మి, సలోమి, పావని, శంకర్, శ్రీనివాస్, సాహెబ్ అలీ, రాంనాయక్, బిచ్చు, విద్యాసాగర్, రమేష్, వెంకటేశ్వర్లు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణయుగం

**కాకతీయ, చందుర్తి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం దేవుని తండాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గిరిజనులు ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం, సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడం, హైదరాబాద్‌లో బంజారా భవన్ నిర్మించడం, పోడు భూములకు పట్టాలు, గిరిజన బంధు వంటి చర్యలతో కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు గౌరవం, అభివృద్ధి లభించాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని విస్మరిస్తోందని నాయకులు విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో గిరిజనులంతా ఏకమై కేసీఆర్‌కు అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య మోహన్, మండల యూత్ అధ్యక్షుడు భూక్య గబ్బర్ సింగ్, డైరెక్టర్ బానోత్ ఫుల్ సింగ్, గ్రామశాఖ అధ్యక్షుడు అజ్మీరా చంద్రు, భూక్య సరిలాల్, వార్డు సభ్యులు, గిరిజన నాయకులు, కార్యకరలు పెద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం

- సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలక ఘట్టం
- సర్దార్ పటేల్ సేవలు మరువలేనివి
- బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్



**కాకతీయ, శంకరపట్నం:** నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించి, హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సెప్టెంబర్ 17 చారిత్రాత్మక రోజని బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా శంకరపట్నం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగుల అనిల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన కీలక పాత్రను ఎప్పటికీ మరువలేమన్నారు. తెలంగాణ విమోచన కోసం పోరాడిన యోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు దాసరపు నరేందర్, సీనియర్ నాయకులు దొంగల రాములు, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మశెట్టి సంపత్‌రావు, మండల ఉపాధ్యక్షులు రాసమల్ల శ్రీనివాస్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కనకం కుమార్, మండల కోశాధికారి బోడ తిరుపతి, సోషల్ మీడియా కన్వీనర్ కూనారపు శ్రీనాథ్, నాయకులు కొయ్యడ అశోక్, చెర్ల శ్రీనివాస్, బిజిలి సారయ్య, బొడిగె నరేష్, పోతునూరి రాజు, పంజాల అనిల్, బొజ్జ కుమార్, వీరబాబు, నాగయ్య, తిరుపతిరావు, బండ శ్రీనివాస్, గాలి తిరుపతి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వరంగల్ అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు సాయం

- కుడా కార్యాలయంలో ప్రపంచ బ్యాంకు బృందంతో ఎంపీ, కలెక్టర్ల సమావేశం
- రూ. 300 మిలియన్ డాలర్ల రుణంలో 70% ప్రపంచ బ్యాంకు వాటా



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రపంచ బ్యాంకు సహకారం అందించనుంది. ఇందులో భాగంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం గురువారం నగరంలో పర్యటించింది. హన్మకొండలోని కుడా కార్యాలయంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు డా. సత్య శారదా, చాహత్ బాజ్ పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్నలతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పూనం అహ్లువాలియా, అపూర్వ సెన్వి, నేహా ప్రవాస్, వెంకటరావు భయాన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు. పట్టణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 300 మిలియన్ డాలర్ల రుణ ప్రతిపాదనను ప్రపంచ బ్యాంకు సూత్రప్రాయంగా ఆమోదించిన నేపథ్యంలో ఈ పర్యటన జరిగింది. ఇందులో 70 శాతం ప్రపంచ బ్యాంకు రుణం, 30 శాతం రాష్ట్ర వాటా ఉంటుందని అధికారులు తెలిపారు. వరంగల్ నగరంలో అశోక జంక్షన్, భద్రకాళి ఆలయం వద్ద మల్టీ లెవల్ కార్ పార్కింగ్, సెంట్రల్ ప్లాజా పునర్నిర్మాణం, రోప్ వే, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్, సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వంటి ప్రాజెక్టులను అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డీపీఆర్ సిద్ధంగా ఉండి టెండర్ల దశకు చేరిన ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇస్తామని, వరంగల్ హెరిటేజ్ నగరం కాబట్టి హెరిటేజ్, పర్యాటక ప్రాజెక్టులకు అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు బృందం తెలిపింది. సమావేశంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు తదితరులు పాల్గొన్నారు.



# నిజాం నిరంకుశత్వానికి చరమగీతం

- అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి
- బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

**కాకతీయ, హన్మకొండ :** నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడి తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవం సందర్భంగా మడికొండ చౌరస్తాలో వరంగల్ జిల్లా కార్యదర్శి పోనగోటి వెంకట్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో అంతర్భాగమైందని తెలిపారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్, తౌటిరెడ్డి రవీందర్‌రెడ్డి, కేతిక సదానందం, పుల్యాల రవీందర్‌రెడ్డి, నాయిని కుమార్, వైకుంఠం, దండిగం సంపత్, తక్కలపల్లి నిఖిల్‌రావు, చిరంజీవి, నాగవెల్లి గోపికృష్ణ, అంబాల మహేశ్వరి, ఎలగొండ శివ, బైరి సతీష్, మిట్టపల్లి హేమంత్, పల్లకొండ రాజేందర్, దారంగుల రాజేష్, వస్కుల భాస్కర్, మాచర్ల రంజిత్, పూజారి శ్రావణ్, రాజు యాదవ్, ప్రణయ్, తాడం రంజిత్, కుప్పిరాల సతీష్, లకావత్ నవీన్, వలబోజు నాగార్జున, గోకల కుమార్, చింతనూరి నరేందర్, అన్నందాస్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛ వరంగల్ నిర్మిద్దాం!

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న
- అలంకార్ జంక్షన్ లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ప్రారంభం

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** స్వచ్ఛతే సేవ, సమష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛ వరంగల్ ను నిర్మిద్దామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవా2026లో భాగంగా గురువారం అలంకార్ జంక్షన్ వద్ద గల కాలువలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సిబ్బందితో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పరిశుభ్రమైన నగరం ప్రజల సమష్టి బాధ్యతతోనే సాధ్యమవుతుందన్నారు. "స్వచ్ఛత మే సహభాగ్ స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్" సందేశంతో ప్రజల్లో బాధ్యత పెంపొందించడమే లక్ష్యమన్నారు. "మన నగరం మన బాధ్యత" స్ఫూర్తితో ప్రజలు స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయవద్దని సూచించారు. నేటి నుం అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని, అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా "ఏక్ పెడ్ మా కే నామ్"లో భాగంగా మొక్కలు నాటుతామని తెలిపారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డా రాజారెడ్డి, ఎంహెచ్ఓ డా రాజేష్, శానిటరీ సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులకు యూనిఫాం అందజేత

**కాకతీయ, నల్లబెల్లి :** విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్స్, షూజ్, బెల్టులను అందజేసినట్లు పంతులుపల్లి ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి తెలిపారు. గురువారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాగరాజుపల్లి, మామిండ్లవీరయ్యపల్లి గ్రామాల సర్పంచులు ఎరుకల లలిత రఘున, ఏడాకుల సరోజన సంపత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్స్, షూజ్, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగరాజుపల్లి పంచాయతీ కార్యదర్శి డాక్టర్ విష్ణు, ఇరు గ్రామాల ఉపసర్పంచులు బైరి శోభన, కదురు నాగరాజు, పాఠశాల ఏఏపీసీ చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి, సాధన వీఓ నూతన అధ్యక్షురాలు కదురు లావణ్య, గ్రామ పెద్దలు ఎరుకల రఘుణారెడ్డి, బైరి అశోక్, ఉపాధ్యాయులు కూనమల్ల రాజన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరుస విషాదాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన

- పెద్ది మరణం నుంచి కోలుకోకముందే సర్పంచ్ మృతి.. ప్రమాదంలో సీనియర్ నాయకుడికి తీవ్ర గాయాలు



**కాకతీయ, నల్లబెల్లి:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి అకాల మరణం నుంచి కోలుకోకముందే అదే పార్టీకి చెందిన సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం, ఆమె భర్త, పార్టీ సీనియర్ నాయకుడు కస్తూరి రవీందర్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో విషాదం, ఆందోళన నెలకొంది. నల్లబెల్లి మండలం లెంకలపల్లి గ్రామానికి చెందిన కస్తూరి విజయలక్ష్మి, ఆమె భర్త రవీందర్ బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఇటికలపల్లి బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ విజయలక్ష్మి గురువారం మృతి చెందగా, రవీందర్ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మెడికవర్ ఆస్పత్రికి వెళ్లి రవీందర్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం లెంకలపల్లికి చేరుకుని కస్తూరి విజయలక్ష్మి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వరుసగా పార్టీకి చెందిన కీలక నాయకులను కోల్పోవడం, తాజాగా గ్రామ సర్పంచ్ ప్రమాదంలో మృతి చెందడం, సీనియర్ నాయకుడు రవీందర్ తీవ్రంగా గాయపడటంతో నల్లబెల్లి మండల బీఆర్ఎస్ శ్రేణుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇప్పటికే పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన క్యాడర్, ఆ విషాదం నుంచి పూర్తిగా కోలుకోకముందే విజయలక్ష్మి మృతి చెందడంతో మరింత కలతకు గురవుతోంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో లెంకలపల్లికి చేరుకుని విజయలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉత్తరం కాకతీయ
WWW.KAKATIYANEWS.COM

రాజ్యాధికారం సాధనే
బీసీల అభివృద్ధికి మార్గం

జనరల్ సీటు అంటే
ఓసీలే పోటీకి నిలబడాలా..?

జనరల్ సీట్లు అందరివీ..
ఒక్క వర్గానికే ఎందుకు?

ఓసీలకు నోట్ల బలం ఉంటే..
బీసీలకు ఓట్ల బలం ఉంది

ఆ బలాన్ని గుర్తించి ఐక్యంగా
పోరాడితేనే సత్ఫలితం

బీసీలకు జరుగుతున్న దగాపై
ఐక్య పోరాటాలతో ముందుకెళ్లాలి

బీసీ నినాదంపై ఏ రూపంలో
అయినా సప్పుడైతే మంచిదే

ఇప్పుడు మార్పునకు అడుగులు
పడుతున్నాయి.. పార్టీల్లో
ఆ భయం మొదలైంది

వరంగల్ జీడబ్ల్యూఎంసీ
ఎన్నికల్లో బీసీల పవర్ చూపుతాం

అక్టోబర్‌లో పరకాలలో బీసీల
బహిరంగ సభ పెడుతున్నాం

ఉమ్మడి వరంగల్‌లో మొత్తం
8 సభలకు ప్లాన్ చేశాం

బీసీలను ఏకం చేస్తాం.. బీసీ
లీడర్లు ఏ పార్టీలో ఉన్నా
ఎంకరేజ్ చేస్తాం

ఓబీసీ ప్రెసిడెంట్, కుడా
మాజీ చైర్మన్ సంగంరెడ్డి
సుందర్‌రాజ్ యాదవ్

# మా వాటా మాకివ్వండి

“బీసీలకు స్కీంలు కాదు.. రాజకీయంగా సీట్లు కావాలి. రాజకీయంగా నిలబడితేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. రాజ్యాధికారం సాధించడమే బీసీల అభివృద్ధికి మార్గం. బీసీలకు రావాల్సిన రాజకీయ వాటా దక్కే వరకు మా ఉద్యమం కొనసాగుతుంది. బీసీలకు జరుగుతున్న దగాపై ఐక్య పోరాటాలతో ముందుకు సాగాల్సిందే” అని ఓబీసీ ప్రెసిడెంట్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు.జనరల్ సీటు అంటే ఓసీలకు కేటాయించబడిన సీట్లన్న భావన అన్ని పార్టీల్లో నెలకొని ఉండటం దురదృష్టకరం. జనరల్ సీట్లు అందరివీ అయినప్పుడు ఒక్క వర్గానికే ఎందుకు పరిమితం చేస్తున్నారు? ఓసీలకు నోట్ల బలం ఉంటే.. బీసీలకు ఓట్ల బలం ఉంది. ఆ బలాన్ని గుర్తించి బీసీలంతా ఐక్యంగా పోరాడితేనే సత్ఫలితం వస్తుంది” అని ఆయన స్పష్టం చేశారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగాలు, వరంగల్ అభివృద్ధి, తన రాజకీయ ప్రస్థానంపై ఓబీసీ ప్రెసిడెంట్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!!



### ఉద్యోగాలు, విద్యకు ఓబీసీ కార్యాచరణ

బీసీ యువతకు కేవలం రాజకీయ నినాదాలు సరిపోవు. విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి అవసరం. అక్టోబర్ 9న మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నాం. బీసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు, నైపుణ్యాలను పెంచేందుకు కార్యక్రమాలు చేపడుతున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతను ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నాం. బీసీలు ఆర్థికంగా ఎదగాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఓబీసీ సంస్థ ద్వారా బీసీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఉపాధి అవకాశాలను అన్వేషిస్తున్నాం. బీసీలు ఉన్నత స్థాయికి ఎదగకుండా అడ్డుకునే పరిస్థితులు ఉన్నాయి. వాటిని ఎదుర్కొనేందుకు సామాజిక ఐక్యత అవసరం. ఓసీలు మాకు శత్రువులు కాదు. అయితే బీసీలకు దక్కాల్సిన అవకాశాలను ఇతరులు ఆక్రమించకూడదు. విద్య, ఉద్యోగాలు, ఆరోగ్యం, ఆర్థిక అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. బీసీ యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి. ప్రైవేటు రంగంలోనూ అవకాశాలు పొందేలా సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలి.



### ఈడబ్ల్యూఎస్, ఆదాయ పరిమితులపై ప్రశ్నలు

బీసీలకు, ఓసీలకు పేదరికాన్ని నిర్ణయించే ఆదాయ పరిమితుల్లో ఇంత తేడా ఎందుకు? బీసీలకు రూ.1.50 లక్షల ఆదాయం లోపు ఉంటే పేదలుగా పరిగణిస్తున్నారు. ఓసీలకు రూ.8 లక్షల ఆదాయం లోపు ఉంటే పేదలుగా పరిగణించడం ఏ విధమైన న్యాయం? ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ విషయంలోనూ రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలి. 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల బీసీల ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడుతోంది. ఈ అంశంపై సమగ్ర చర్చ జరగాలి. బీసీల ఓట్లను తీసుకుని వారికి సీట్లు ఇవ్వకపోవడం సరైన విధానం కాదు. రాజకీయ పార్టీలు తాము బీసీలకు అనుకూలమా? వ్యతిరేకమా? ముందుగానే స్పష్టం చేయాలి. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ



ప్రాతినిధ్యం కల్పించే విషయంలో స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి. బీసీలకు న్యాయం చేయాలంటే కేవలం మాటలు కాకుండా ఆచరణలో నిర్ణయాలు తీసుకోవాలి. బీసీల హక్కుల విషయంలో రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.

### వరంగల్ అభివృద్ధికి విజన్ అవసరం

వరంగల్ నగరానికి అభివృద్ధి అవకాశాలు చాలా ఉన్నాయి. కానీ వాటిని వినియోగించుకునేందుకు స్పష్టమైన ప్రణాళిక, దాన్ని అమలు చేసే నాయకత్వం అవసరం. కుడా ద్వారా మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరల్లో ఇళ్లు అందించవచ్చు. నగరానికి బయట అపార్ట్‌మెంట్లు నిర్మించి రూ.30 లక్షల లోపు ధరలకు అందిస్తే మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగం ఉంటుంది. నేనుకూడా చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఈ విషయాన్ని నాటి ప్రభుత్వ పెద్దల దృష్టికి సైతం తీసుకెళ్లాను. కానీ నాన్చివేత ధోరణితో పక్కన పెట్టేశారు. కుడా పరిధిలోని ప్రైవేటు భూములను అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ స్థలాలను కూడా వినియోగించుకోవాలి. సరైన ప్రణాళికతో పనిచేస్తే ఒక్క పశ్చిమ నియోజకవర్గానికే రూ.500 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. కుడా ద్వారా వచ్చే ఆదాయంలో 75 శాతం స్థానికంగానే ఖర్చు చేయాలనే నిబంధన ఉంది. భూముల మార్టిగేజ్ చార్జీలు వసూలు చేస్తే కుడాకు భారీ ఆదాయం వస్తుంది. నా హయాంలో పలువురికి నోటీసులు ఇచ్చినా ఆ అంశం తర్వాత నిర్లక్ష్యానికి గురైంది. అభివృద్ధి సంస్థలకు ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించి.. ఆ ఆదాయాన్ని నగర అభివృద్ధికే వినియోగించాలి.

### ఐటీ టవర్లు, టూరిజంతో ఉపాధి అవకాశాలు

హైదరాబాద్ తర్వాత వరంగల్ ఐటీ కేంద్రంగా ఎదగాలనే ఉద్దేశంతో పనిచేశాను. అమెరికా పర్యటనలో 13 కంపెనీలతో చర్చించి వరంగల్‌లో సంస్థలు ఏర్పాటు చేసేందుకు ఒప్పించే ప్రయత్నం చేశాను. మడికొండలో ఐటీ రంగానికి కేటాయించిన స్థలం చుట్టూ పారిశ్రామిక ప్రాంతం ఉండటంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు. నగర కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో ఐటీ టవర్లు నిర్మించి కంపెనీలకు కేటాయిస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రస్తుతం వరంగల్ యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దేవునూరు గుట్టల్లోని 5 వేల ఎకరాల్లో పర్యాటక అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాం. డిస్నీల్యాండ్ తరహా ప్రాజెక్టును తీసుకురావాలనుకున్నాం. ఇందుకోసం 500 ఎకరాలు కుడా కేటాయించేందుకు సిద్ధమని నాటి ప్రభుత్వం లేఖ ఇచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేస్తే వరంగల్ ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్ రంగాలను అనుసంధానం చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. నగర అభివృద్ధికి దీర్ఘకాలిక విజన్ అవసరం. తాత్కాలిక నిర్ణయాలతో కాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలి.

ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

### బీసీలకు రాజకీయ న్యాయం జరిగే వరకూ ఉద్యమం

“బీసీలకు సంక్షేమ పథకాలు ఇవ్వడం మాత్రమే సామాజిక న్యాయం కాదు. రాజకీయ అధికారంలో వాటా ఇవ్వాలి. చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. రాజకీయ పార్టీల్లో పదవులు ఇవ్వాలి. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పించాలి. అప్పుడే బీసీలకు నిజమైన న్యాయం జరిగినట్లు అవుతుంది. ఎన్నికల్లో పార్టీలకు బీసీల ఓట్లు కావాలి గాని.. సీట్ల కేటాయింపు విషయంలో మాత్రం బీసీలను పక్కన పెట్టే విధానం కొనసాగుతోంది. ఈ పరిస్థితి మారాలి. బీసీల్లో చైతన్యం పెరిగినప్పుడే రాజకీయ పార్టీలకు చచ్చినట్లుగా బీసీ వాదానికి తప్పక తలొగ్గుతాయి. మొత్తం జనాభాలో బీసీలకు 50 శాతంపైబడి ఉన్నారు. మరి రాజకీయంగా అంతే స్థాయిలో సీట్లు కోరుకోవడం తప్పేలా అవుతుంది. పార్టీలన్నీ బీసీల ఓట్లను కోరుకుంటున్నాయి. కానీ సీట్లు ఇచ్చే విషయంలో మాత్రం వెనుకంజ వేస్తున్నాయి. ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికల తర్వాత మరో మాట చెప్పే రాజకీయాలకు ముగింపు పలకాలి. “బీసీలకు న్యాయం జరిగే వరకు ఓబీసీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, ఉద్యమాలు కొనసాగిస్తాం. బీసీలకు జరుగుతున్న దగాపై ఐక్య పోరాటాలతో ముందుకెళ్లాలి. బీసీ నినాదం ఏ రూపంలో ఉన్నా మంచిదే. బీసీల హక్కులపై ప్రజల్లో చైతన్యం పెంచేలా సప్పుడైతే కావాల్సిందే. ప్రతి ఇంటి నుంచి బీసీ నినాదం మొదలుకావాలి. ప్రతి కుటుంబం తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలి. బీసీల ఓట్లను ఎన్నికల సమయంలో వినియోగించుకుని.. రాజకీయ అవకాశాలు ఇవ్వని పరిస్థితిని మార్చాల్సిన సమయం వచ్చింది.

### జనరల్ స్థానాలు అందరివీ.. ఒక్క వర్గానివి కావు

జనరల్ స్థానాలు అన్ని కులాలు, వర్గాల వారు పోటీ చేయడానికి ఉద్దేశించినవి. కానీ జనరల్ సీటు అంటే ఒకే వర్గానికి చెందిన అభ్యర్థులే పోటీ చేయాలనే భావన ఏర్పడింది. ముఖ్యంగా వరంగల్ మేయర్ స్థానం జనరల్‌గా మారినప్పుడు ఫలానా రెడ్డి, మరో రెడ్డి అంటూ చర్చ జరగడం ఏమిటి? బీసీల నుంచి నాయకులు లేరా? బీసీల్లో సామర్థ్యం ఉన్నవారు లేరా? జనరల్ మేయర్ స్థానం అందరికీ అందుబాటులో ఉన్నప్పుడు ఒక్క వర్గానికే పరిమితం చేయడం ఎందుకు?” అని సుందర్‌రాజ్ యాదవ్ ప్రశ్నించారు. “వరంగల్ మేయర్ స్థానం ఈసారి బీసీలకే దక్కేలా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తాం. బీసీలు రాజకీయంగా ఏకమైతే జనరల్ స్థానాల్లోనూ తమ అభ్యర్థులను గెలిపించుకునే శక్తి వస్తుంది. ఓసీలకు నోట్ల బలం ఉండొచ్చు. కానీ బీసీలకు ఓట్ల బలం ఉంది. ఆ ఓట్ల బలాన్ని రాజకీయ శక్తిగా మార్చుకోవాలి. బీసీలు విడిపోయి ఉంటే ఇతరులకు లాభం జరుగుతుంది. బీసీలంతా ఒకే మాటపై నిలబడితే రాజకీయ పార్టీలు కూడా తమ నిర్ణయాలను మార్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పుడు మార్పునకు అడుగులు పడుతున్నాయి. పార్టీల్లో ఆ భయం మొదలైంది” అని ఆయన అన్నారు.

### పరకాలలో బీసీల బహిరంగ సభ

“అక్టోబర్‌లో పరకాలలో బీసీల బహిరంగ సభ నిర్వహిస్తున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 8 సభలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఈ సభల ద్వారా బీసీలకు రాజకీయ, సామాజిక హక్కులపై అవగాహన కల్పిస్తాం. బీసీలను ఏకం చేస్తాం. బీసీ లీడర్లు ఏ పార్టీలో ఉన్నా వారిని ప్రోత్సహిస్తాం. బీసీలు ఏ పార్టీలో ఉన్నా ఎదుర్కొంటున్న సమస్యలు చాలా వరకు ఒకేలా ఉంటాయి. ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలను గుర్తు చేసుకునే విధానం మారాలి. “దేశవ్యాప్తంగా బీసీల హక్కులపై చర్చ మొదలైంది. ఈ చర్చను రాజకీయ ప్రాతినిధ్యంగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. బీసీ ఉద్యమం బలపడితే డబ్బులు లేకుండానే అభ్యర్థులు గెలిచే పరిస్థితి వస్తుంది. ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో, ప్రతి నియోజకవర్గంలో బీసీలను సమన్వయం చేస్తాం. బీసీ నాయకత్వాన్ని పెంచుతాం. బీసీ నాయకులు ఏ పార్టీలో ఉన్నా వారికి ఎదురయ్యే సమస్యలపై కలిసి పోరాడతాం. పార్టీలు వేరైనా బీసీల హక్కుల విషయంలో ఐక్యంగా ఉండాలి.

### తండ్రి మాటే జీవితానికి బాట

1970 జనవరి 1న వడ్డేపల్లిలో జన్మించాను. మా తల్లిదండ్రులు లక్ష్మీరాజం, వరలక్ష్మి దంపతులకు 10 మంది సంతానం. అందరిలో నేనే చివరివాడిని. మా తండ్రి ఎక్సైజ్ శాఖలో పనిచేసేవారు. చదువుపై ఆయనకు ఎంతో మక్కువ. కుటుంబంలోని అందరికీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయించారు. ఆడపిల్లలను చదివించేందుకు చాలామంది వెనుకాడిన కాలంలోనే మా రెండో అక్కను సివిల్స్ రాసేలా ప్రోత్సహించారు. మా తండ్రి లాహోర్‌లో చదువుకున్నారు. స్వాతంత్ర్యం అనంతరం మా కుటుంబం వరంగల్‌లో స్థిరపడింది” అని సుందర్‌రాజ్ యాదవ్ తన కుటుంబ నేపథ్యాన్ని వివరించారు. రూ.10 వేల ఫీజు చెల్లించలేక హైదరాబాద్‌లో డిగ్రీలో చేరాను. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ, కాకతీయ యూనివర్సిటీలో ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేశాను. 1991లో రూ.1,200 మొదటి జీతంతో ఉద్యోగ జీవితం ప్రారంభించాను. మా తండ్రి భీమారంలోని ఇల్లు అమ్మి ఇచ్చిన రూ.1.50 లక్షలతో కంప్యూటర్ శిక్షణా కేంద్రానికి బీజం పడింది. 1992లో మాస్టర్‌జీ ఇన్‌స్టిట్యూట్స్ ప్రారంభించాను. ప్రొఫెసర్ జయశంకర్ ప్రోత్సాహంతో విద్యా రంగంలోకి అడుగుపెట్టాను. 2001 నుంచే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాను. 2009 నుంచి మాస్టర్‌జీ వేదికగా ఉద్యమ సమావేశాలు నిర్వహించాను. 2015, 2021లో ఎమ్మెల్సీ అవకాశాలు చేజారాయి. కుడా చైర్మన్, మేయర్ పదవులపై హామీలు వచ్చినా అమలు కాలేదు. అయినప్పటికీ ప్రజా జీవితం, బీసీ ఉద్యమం, వరంగల్ అభివృద్ధి కోసం నా ప్రయాణం కొనసాగుతుంది. బీసీలకు రాజకీయ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తూనే ఉంటాను. బీసీలను ఏకం చేసి వారికి రావాల్సిన రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాల కోసం నిరంతరం పనిచేస్తాను” అని ఓబీసీ ప్రెసిడెంట్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ స్పష్టం చేశారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266